నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

కొండగట్టులో నేటి నుంచి హనుమాన్ చాలీసా పారాయణం: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, ఏప్రిల్ 15:హనుమాన్ జయంతిని పురస్కరించుకుని జగిత్యాల జిల్లాలోని కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్రంలో శనివారం నుంచి 40 రోజులపాటు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. కొండగట్టు ఆంజన్న సేవాసమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

తెలంగాణ ప్రజలు శాంతి, సౌభాగ్యాలతో సుభిక్షంగా ఉండాలనే ఆకాంక్షతో ఈ బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కవిత వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని, స్వామివారి కృపకు పాత్రులుకావాలని కోరారు.

హైదరాబాద్ | శనివారం 16-4-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 208 | పేజీలు:4 | వెల: రూ.1/-

రానున్న పదేళ్ళలో రికార్డు స్థాయిలో కొత్త వైద్యులు : మోదీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి జిల్లాకు ఒక వైద్య కళాశాల పథకం వల్ల రానున్న పదేళ్లలో రికార్డు స్థాయిలో నూతన వైద్యులు రాబోతున్నారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. అందరికీ వైద్య విద్య అందుబాటులో ఉండేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గుజరాత్‌లోని భుజ్ జిల్లాలో కేకే పటేల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఆయన శుక్రవారం వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రారంభించారు.

ఈ ఆసుపత్రి ప్రారంభం సందర్భంగా ఏర్పాటైన సభను ఉద్దేశించి మోదీ మాట్లాడుతూ, దేశంలోని ప్రతి జిల్లాలోనూ ఓ వైద్య కళాశాలను నిర్మించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందన్నారు. వైద్య విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి జరుగుతోందన్నారు. వీటి వల్ల రానున్న పదేళ్ళలో మన దేశంలో కొత్తగా రికార్డు సంఖ్యలో డాక్టర్లు రాబోతున్నారని చెప్పారు. భుజ్ జిల్లాలో ప్రారంభమైన ఈ ఆసుపత్రి ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలను అందుబాటు ధరలకు అందజేస్తుందన్నారు. రెండు దశాబ్దాల క్రితం గుజరాత్‌లో కేవలం తొమ్మిది వైద్య కళాశాలలు, 1,100 సీట్లు మాత్రమే ఉండేవన్నారు. నేడు 36 వైద్య కళాశాలలు, 6,000 సీట్లు ఉన్నాయన్నారు. 2001లో సంభవించిన భూకంపం వల్ల జరిగిన నష్టాన్ని గుర్తు చేసుకుంటూ, భుజ్, కచ్ ప్రాంతాల ప్రజలు తమ కఠోర శ్రమతో ఈ ప్రాంతానికి నూతన విధిని లిఖిస్తున్నారని చెప్పారు. నేడు ఈ ప్రాంతంలో చాలా ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. భుజ్‌లో నేడు అత్యాధునిక, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అందుబాటులోకి వచ్చిందన్నారు. మెరుగైన ఆరోగ్య సదుపాయాలంటే కేవలం వ్యాధులకు చికిత్స మాత్రమే కాదని, సామాజిక న్యాయం కూడా జరగాలని అన్నారు. ఓ నిరుపేద వ్యక్తికి చౌకగా, ఉత్తమ చికిత్స అందితే, ఈ వ్యవస్థపై ఆయన నమ్మకం బలపడుతుందన్నారు.

శ్రీ కచ్చి లేవ పటేల్ సమాజ్ ఆధ్వర్యంలో కేకే పటేల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించారు. కచ్‌లో మొదటి చారిటబుల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఇదే. దీనిలో 200 పడకలు ఉన్నాయి. దీనిలో ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ (క్యాత్‌ల్యాబ్), కార్డియోథొరాసిక్ సర్జరీ, రేడియేషన్ ఆంకాలజీ, మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ, న్యూక్లియర్ మెడిసిన్, న్యూరో సర్జరీ, కీళ్ళ మార్పిడి, ఇతర సేవలు అందుబాటులో ఉంటాయి.

హైదరాబాద్‌లో నేడు మద్యం దుకాణాలు బంద్

హైదరాబాద్, ఏప్రిల్ 15: హనుమాన్ జయంతి, శోభాయాత్ర నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో మద్యం దుకాణాలపై పోలీసులు ఆంక్షలు విధించారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు మద్యం దుకాణాలు మూసి ఉంటాయని పోలీసులు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి మద్యం అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం హైదరాబాద్ నగరంలో శోభాయాత్ర చేపట్టనున్నారు. ఈ క్రమంలో నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు పోలీసులు తెలిపారు. హనుమాన్ శోభాయాత్ర గౌలిగూడ రామ్ మందిర్ నుంచి తాడ్‌బన్‌లోని హనుమాన్ మందిర్ వరకు కొనసాగనుంది. కర్మన్‌ఘాట్ హనుమాన్ టెంపుల్ నుంచి మరో యాత్ర కొనసాగనుంది. కర్మన్‌ఘాట్ నుంచి చంపాపేట్, కోఠి ఉమెన్స్ కాలేజ్, నారాయణగూడ మీదుగా తాడ్‌బన్‌లోని హనుమాన్ మందిర్ వరకు కొనసాగనుంది.

వ్యాక్సిన్ క్యాపిటల్ ఆఫ్ వరల్డ్‌గా తెలంగాణ : మంత్రి కేటీఆర్

సంగారెడ్డి , ఏప్రిల్ 15:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ వ్యాక్సిన్ క్యాపిటల్ ఆఫ్ వరల్డ్‌గా మారిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. వైద్యోపకరణాల తయారీ, పరిశోధనల కోసం హైదరాబాద్‌కు ప్రాధాన్యం పెరిగిందన్నారు. సంగారెడ్డి జిల్లాలోని సుల్తాన్‌పూర్‌లోని మెడికల్ డివైస్ పార్కులో సహజానంద్ మెడికల్ టెక్నాలజీ(ఎస్ఎంటీ) సంస్థను ప్రారంభించారు. ప్రాజెక్టు సంజీవని పేరుతో స్టెంట్ల తయారీ యూనిట్‌ను ఎస్ఎంటీ సంస్థ ఏర్పాటు చేసింది.

ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. కరోనాతో ప్రపంచం వెనుకబడినా ఎస్ఎంటీ వేగం తగ్గలేదు. ఆసియాలోనే అతిపెద్ద స్టెంట్ల తయారీ, పరిశోధన సంస్థ ఎస్ఎంటీ అని కొనియాడారు. దేశంలో మెడికల్ డివైసెస్ తయారీతో ఔషధాలు, వైద్యోపకరణాల ధరలు తగ్గాయి. బయో ఆసియా సదస్సులో వైద్యోపకరణాల తయారీ సంస్థలను కలిశానని గుర్తు చేశారు. దేశంలో 80 శాతం వైద్యోపకరణాలు విదేశాల నుంచి తెస్తున్నామని కేటీఆర్ తెలిపారు.

టీటీడీకి రూ 30 లక్షల విరాళం..

తిరుమల, ఏప్రిల్ 15: గుంటూరు కు చెందిన వంగా హేమలత అనే భక్తురాలు శుక్రవారం టీటీడీ కి రూ 30 లక్షల విరాళంగా అందించారు. తిరుమల క్యాంప్ కార్యాలయంలో తన కుమారుడు శ్రీకాంత్ తో కలసి టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి కి డిడిని అందించారు. ఈ మొత్తం టీటీడీ ప్రాణదానం ట్రస్ట్ కు ఉపయోగించుకోవాలని దాత కోరారు. కాగా నిన్న తిరుమలలోని శ్రీవారిని 82,722 మంది భక్తులు దర్శించుకున్నారు. 33,678 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా రూ. 5.11 కోట్లు ఆదాయం వచ్చిందని టీటీడీ అధికారులు తెలిపారు.

చరిత్రలో నేటినిజం

తే॥ కన్నుని ఆనవాళ్ళ మలో
నెన్నుదమల మూ వగలగు నిష్ణాగులపై
"ఎమ్మెస్సెల్లాయరా" పై
అమ్మో కనులతి భుదు గురియు ఆరగుళ కీర్తిన్ !!

(ఏప్రిల్ 16 హాస్యనటుడు ఎం.ఎస్. నారాయణ పుట్టినరోజు)

-రాధశ్రీ

సెల్: 9494481210

తెలంగాణ న్యాయశాఖ దేశానికి ఆదర్శం కావాలి: సీఎం కేసీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 15:ఎనిమిదేండ్ల క్రితం అవతరించిన తెలంగాణ రాష్ట్రం అందరి సహకారంతో పురోగమిస్తున్నదని సీఎం కేసీఆర్ అన్నారు. చక్కటి ఆర్థిక క్రమశిక్షణతో అన్నిరంగాల్లో దూసుకుపోతున్నామని చెప్పారు. విద్యుత్ రంగంలో అద్భుతమైన పురోగతి సాధిస్తున్నామని, వ్యవసాయ, పారిశ్రామిక రంగంలో ముందుకెళుతున్నామన్నారు. పరిపాలన సంస్కరణలు తీసుకొచ్చి 33 జిల్లాలు ఏర్పాటు చేశామన్నారు.

ఆర్‌బీఐ లెక్కల ప్రకారం తెలంగాణ తలసరి ఆదాయం రూ.2.78 లక్షలు అని చెప్పారు. గచ్చిబౌలిలోని అన్వయ కన్వెన్షన్‌లో జరుగుతున్న న్యాయాధికారుల సదస్సుకు సీజేఐ ఎన్వీ రమణ, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సతీష్ చంద్ర శర్మ, ఏపీ హైకోర్టు సీజే జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్ర, సీఎం కేసీఆర్, మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర న్యాయ పరిపాలన విభాగం ఇంకా ముందుకెళ్లాలని, దేశానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

హైదరాబాద్ పట్ల జస్టిస్ ఎన్వీ రమణకు చాలా ప్రేమ ఉన్నదని చెప్పారు. సుదీర్ఘకాలం హైదరాబాద్‌లో పనిచేసినందున ఆయనకు అన్ని విషయాలు తెలుసున్నారు. హైకోర్టు విడిపోయిన తర్వాత బెంచీల సంఖ్య పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినప్పటికీ పెండింగ్‌లో పెట్టారని చెప్పారు. అయితే సీజేఐ రమణ చొరవతో హైకోర్టు బెంచీలను 24 నుంచి 42కు పెంచారన్నారు.

న్యాయ వ్యవస్థలో గతంలో 780 పోస్టులు మంజూరు చేశామని సీఎం కేసీఆర్ వెల్లడించారు. మరో 885 అదనపు పోస్టులు హైకోర్టుకు మంజూరు చేశామన్నారు. జిల్లా కోర్టులకు అదనంగా 1730 పోస్టులు మంజూరు చేశామన్నారు. జిల్లా కోర్టులలో పనిభారం ఉందని తెలిసిందన్నారు.

జిల్లా కోర్టుల్లో జడ్జిలు, మెజిస్ట్రేట్ సిబ్బందిని నియమిస్తే పనిభారం తగ్గుతుందని చెప్పారు. 23 జిల్లాల్లో జిల్లా కోర్టు భవనాలు చేపడతామని, వాటికోసం స్థల సేకరణ జరుగుతున్నదని వెల్లడించారు.

రాష్ట్రంలో ఇప్పటివరకు కోటీ 52 లక్షల ఎకరాల భూములను డిజిటలైజ్ చేశామన్నారు. రెవెన్యూ కోర్టులను ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. న్యాయమూర్తులు హోదాకు తగ్గట్లుగా 42 మంది జడ్జిలకు 30 ఎకరాల్లో క్వార్టర్స్ నిర్మిస్తామని, సీజేఐ రమణతో శంకుస్థాపన చేయిస్తామన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులు ఆకర్షించడంలో పోటీ నెలకొందని సీఎం కేసీఆర్ అన్నారు. పారిశ్రామికవేత్తలు న్యాయవ్యవస్థ గురించే అడుగుతారని చెప్పారు. సమస్యలు వెంటనే పరిష్కరిస్తే మరిన్ని పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

చేతికి ఎముక లేదనడానికి ట్రేడ్‌మార్క్ కేసీఆర్: సీజేఐ ఎన్వీ రమణ

హైదరాబాద్, ఏప్రిల్ 15:చేతికి ఎముక లేదనడానికి ట్రేడ్‌మార్క్ సీఎం కేసీఆర్ అని సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య తగ్గించాలని కేంద్రం, ఇతర రాష్ట్రాలు భావిస్తుంటాయని, తెలంగాణలో మాత్రం సీఎం కేసీఆర్ 4320కిపైగా ఉద్యోగాలు సృష్టించారన్నారు.

హైదరాబాద్ గచ్చిబౌలిలోని అన్వయ కన్వెన్షన్‌లో జరిగిన న్యాయాధికారుల సదస్సుకు సీజేఐ ఎన్వీ రమణ, హైకోర్టు సీజే జస్టిస్ సతీష్ చంద్ర శర్మ, ఏపీ హైకోర్టు సీజే జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్ర, సీఎం కేసీఆర్, మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీజేఐ ఎన్వీ రమణ మాట్లాడుతూ న్యాయవ్యవస్థ బలోపేతానికి కేసీఆర్ కృషిచేస్తున్నారని చెప్పారు.

తెలంగాణ ఏర్పడిన తర్వాత న్యాయాధికారుల సమావేశం జరగడం ఇదే తొలిసారని వెల్లడించారు. న్యాయవ్యవస్థను బలపరిచేందుకు ఈ సమావేశం ఉపయోగపడుతుందన్నారు.

హైకోర్టులో ఇటీవల జడ్జీల సంఖ్య పెంచామని చెప్పారు. కేసుల త్వరితగతిన పరిష్కారానికి జడ్జీల పెంపు అవసరమన్నారు. రెండేండ్లుగా పెండింగ్‌లో ఉన్న జడ్జీల సంఖ్య పెంపు అంశాన్ని పరిష్కరించామన్నారు. న్యాయవ్యవస్థను ఇంకా బలపరచాలని భావిస్తున్నామని చెప్పారు. జిల్లా కోర్టుల్లోనూ జడ్జీల సంఖ్య పెంచుతున్నామని వెల్లడించారు.

ఇటీవల హైదరాబాద్‌లో అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ మీడియేషన్ సెంటర్ వచ్చిందని చెప్పారు. వివాదాల సత్వర పరిష్కారానికి ఈ కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. తమ రాష్ట్రాల్లోనూ ఇలాంటి కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నారని వెల్లడించారు.

పాలమూరులో అడుగుబెట్టే అర్హత లేదు-మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 15: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేస్తున్నది ముమ్మాటికీ ప్రజా వంచన యాత్ర అని మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. జూటాకోరు పార్టీ అధ్యక్షుడు చేస్తున్న దగాకోరు యాత్ర అని ఆగ్రహం వ్యక్తంచేశారు. పచ్చబడుతున్న పాలమూరుపై కక్ష కట్టిన మీకు అక్కడ అడుగుపెట్టే హక్కులేదన్నారు. బండి సంజయ్ తన పాదయాత్రను పాలమూరు జిల్లా నుంచి ప్రారంభించడమంత దగాకోరుతనం ఇంకొకటి లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. పాదయాత్ర కాదు.. మోకాళ్ల యాత్ర చేసి తెలంగాణకు ప్రజలకు క్షమాపణలు చెప్పాలన్నారు. తెలంగాణ పుట్టకముందే కత్తిగట్టిన పార్టీ బీజేపీ అని విమర్శించారు. బండి సంజయ్ చేస్తున్న ప్రజా సంగ్రామ యాత్రపై మంత్రి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. 'పచ్చ బడుతున్న పాలమూరుపై పగ బట్టిన పార్టీకి అధ్యక్షుడైన బండి సంజయ్‌కు అక్కడ అడుగుబెట్టే నైతిక అర్హత లేదు. పాలమూరు గడ్డకు బీజేపీ చేసిన ద్రోహం, ప్రాజెక్టుల మంజూరులో చూపిన నిర్లక్ష్యం, నిధుల విడుదలలో కేంద్ర ప్రభుత్వం చేసిన వంచనకు పాలమూరు ప్రజానికానికి బండి సంజయ్ క్షమాపణ చెప్పాలి. దశాబ్దాల పోరాటంతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర అస్తిత్వాన్ని పదేపదే ప్రశ్నిస్తు, ఎగతాళి చేస్తున్న నియంతృత్వ పోకడలపై ముందుగా తెలంగాణ జాతికి క్షమాపణ చెప్పి పాదయాత్రను ప్రారంభిస్తే కాస్తయినా గౌరవం దక్కుతుంది.

పల్లేర్లు మొలిసిన పాలమూరు గడ్డలో పచ్చని పంటలు

ఒకప్పుడు పల్లేర్లు మొలిసిన పాలమూరు గడ్డ, ఈ రోజు పచ్చని పంటలతో కళకళలాడుతున్నదన్న నిజాన్ని కలలో కూడా ఓర్వలేకపోతున్న నాయకత్వం బీజేపీది. పాలమూరుకు నీళ్లిచ్చే ప్రాజెక్టులపై బోర్డులు పెట్టి బోడి పెత్తనం చేస్తూ.. పండుతున్న పొలాలను ఎండబెట్టాలని కుట్రలు చేసిన వాళ్లు ఇప్పుడు కపట యాత్రలు చేస్తారా..?. పాలమూరు జిల్లా వ్యవసాయానికి ఆయువుపట్టు అయిన కృష్ణా జలాలలో వాటా తేల్చకుండా కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు పేరుతో ఒక శిఖండి సంస్థను ఏర్పాటుచేసి పాలమూరుకు న్యాయంగా దక్కాల్సిన నదీ జలాల వాటాను సందిగ్ధంలోకి నెట్టిన కుట్రపూరిత పార్టీ బీజేపీ. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా తేల్చకుండా జలదోపిడికి జై కొడుతూ, పాలమూరు రైతుకు ద్రోహం చేస్తున్న బీజేపీ బానిస నాయకులు సిగ్గూ ఎగ్గూ లేకుండా యాత్రలు చేస్తారా..?

కర్ణాటకపై కనికరం.. పాలమూరు మీద కక్షెందుకు

పాలమూరు ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇవ్వమని చేసిన విజ్ఞప్తికి కేంద్రంలో అధికారంలో ఉన్న మీ పార్టీ స్పందన ఏంటో బండి సంజయ్ చెప్పాలి. పక్కనే ఉన్న కర్ణాటక అప్పర్ భద్రా ప్రాజెక్టుకు జాతీయహోదా ఇచ్చి పాలమూరు ప్రాజెక్టుకు ఎందుకు ఇవ్వలేదో చెప్పిన తరువాతే పాలమూరు గడ్డ మీద బండి సంజయ్ అడుగుపెట్టాలి. కర్ణాటక మీద కనికరం చూపిన మీరు పాలమూరు మీద కక్ష ఎందుకు ప్రదర్శిస్తున్నరో సమాధానం చెప్పాలి?. పాలమూరు రైతు చేసిన పాపం ఏంది..? పాలమూరు ప్రజల చిరకాల కోరిక అయిన గద్వాల, మాచార్ల రైల్వే లైన్ ను ఎలా పూర్తి చేస్తారో బండి సంజయ్ స్పష్టం చేయాలి.

భద్రాద్రి క్షేత్రానికి ఏం చేశారో చెప్పాలి..

ఆదిశక్తి పీఠమైన జోగులాంబను దర్శించుకుని పాదయాత్ర ప్రారంభిస్తున్న బండి సంజయ్, రాష్ట్రంలోని చారిత్రక ప్రాశస్త్యం కలిగిన దేవాలయాలకు అదనంగా ఎన్ని నిధులను తీసుకొచ్చారో రాష్ట్ర ప్రజలకు చెప్పాలి. తెల్లారి లేస్తే రాముడి పేరుతో రాజకీయాలు చేసే నీచమైన భారతీయ జనతా పార్టీ, ఆ కోదండరాముడు నడయాడిన భద్రాద్రి క్షేత్రానికి ఏం చేసిందో తెలంగాణ ప్రజలకు తెలపాలి. దేవాలయాలను, దేవుళ్లను రాజకీయాలకు వాడుకునే చరిత్ర బండి సంజయ్, బీజేపీది. కాని మేం మాత్రం అంచంచలమైన భక్తి, అంకురిత దీక్షతో ఆ సేతు హిమాచలంలోనే అద్భుతమైన దైవక్షేత్రంగా యాదాద్రిని నిర్మించాం. ఈ దైవకార్యంలో భారతీయ జనతా పార్టీ భాగస్వామ్యం ఏమన్నా ఉందా? దేవుళ్లు, దైవాన్ని రాజకీయాలకు వాడుకోవడాన్ని అలవాటుగా మార్చుకున్న భారతీయ జనతా పార్టీ, తెలంగాణ రైతాంగాన్ని కూడా తన చిల్లర రాజకీయాలకు బలి చేస్తోంది.

పంట చేతికొచ్చినంక తప్పించుకు తిరుగుతున్నారు

వడ్లు వేస్తే కేంద్ర ప్రభుత్వంతో కొనిపిస్తామని తెలంగాణ రైతాంగాన్ని తప్పుదోవ పట్టించి, పంట చేతికొచ్చినంక తప్పించుకు తిరుగుతున్న బండి సంజయ్ తన పాదయాత్రకు రైతు దగా యాత్ర లేక రైతు ధోకా యాత్ర అని పేరు పెట్టుకుంటే మంచిది. తెలంగాణ రైతాంగం ప్రస్తుతం ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితిపై బండి సంజయ్ తన వైఖరిని స్పష్టం చేసినంకనే పాదయాత్ర ప్రారంభిస్తే మంచిది. వరిపంటతో రాజకీయ చలిమంటలు వేసుకోవాలని అన్నదాతను ఆగం చేయాలని పన్నాగం పన్నింది మీరు కాదా..? రైతులతో రాబందుల్లా వికృత రాజకీయం చేసి వడ్లను కొనమని అడిగితే చేతగాదని చేతులెత్తేసిన మీరు.. ఇప్పుడు మిడతల దండులా యాత్రకు బయల్దేరుతరా? వడ్లు కొనమని అడిగితే నూకలు తినండని తెలంగాణ ప్రజల్ని అవమానించిన దురహంకారం బీజేపీది. రైతు ద్రోహి.. రాష్ట్ర ద్రోహి పాత్ర పోషిస్తున్న మీకు పాదయాత్ర చేసే నైతిక హక్కు లేనేలేదు.

ధరలపై కేంద్రానిది చేతగానితనం

దశా దిశా లేని బీజేపీ దరిద్ర విధానాలతో దేశంలో ఎన్నడూ లేని విధంగా ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఎక్కాలు రాని నాయకత్వం ప్రజలపై చేస్తున్న సంగ్రామాన్ని గుర్తుకు తెచ్చేలా మీరు ప్రజా సంగ్రామ యాత్ర చేస్తున్నట్టున్నారు. ప్రజల జీవితాలను చిన్నాభిన్నం చేసిన కేంద్ర ప్రభుత్వ చేతగానితనంపై ప్రజలకు బండి సంజయ్ క్షమాపణ చెప్పాలి.

విభజన హామీలు నెరవేర్చే తెలివిలేదు

తెలంగాణకు అడుగడుగునా బీజేపీ అన్యాయమే చేసింది. పొత్తిళ్లలో ఉన్న తెలంగాణ పసిగుడ్డుపై కత్తిగట్టింది. అధికారం ఉందన్న అహంకారంతో తెలంగాణ మండలాలను అన్యాయంగా ఆంధ్రాలో కలిపిన బీజేపీ దౌర్జన్యాన్ని ప్రజలు ఇంకా మర్చిపోలేదు. తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన విభజన హామీలు నెరవేర్చే తెలివిలేదు.

నీతి ఆయోగ్ చెప్పినా నిధులిచ్చే నీతి లేదు

నీతి ఆయోగ్ చెప్పినా నిధులిచ్చే నీతి లేదు. ప్రాజెక్టులకు జాతీయ హూదా ఇవ్వరు. నదీ జలాల్లో వాటాలు తెల్చకుండా జలదోపిడికి సహకరిస్తారు. ఉచిత కరెంట్ ఇస్తుంటే మోటర్లకు మీటర్ల పెట్టమని బ్లాక్ మెయిల్ చేస్తారు. పండించిన పంటలు కొనకుండా రైతును గోస పుచ్చుకుంటారు. సందు దొరికితే చాలు తెలంగాణ మీద విషం గక్కుతారు. తెలంగాణ అంటేనే గిట్టని బీజేపీ నాయకులు కడుపులో ద్వేషం పెట్టుకొని కపట యాత్రలు చేస్తే ఏం లాభం? పాదయాత్రే కాదు మోకాళ్లపై దేక్కుంటూ యాత్ర చేసినా బండి సంజయ్, బీజేపీని తెలంగాణ ప్రజలు నమ్మరు. బీజేపీ డీఎన్ఏలో ఉన్న వివక్ష, విభజన రాజకీయాలను తెలంగాణ ప్రజలు గుర్తించి తిరస్కరిస్తారు' అని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు.

దశల వారీగా దళితబంధు అమలు : మంత్రి సబితా ఇంద్రారెడ్డి

రంగారెడ్డి ఏప్రిల్ 15: దళితబంధులాంటి పథకం వస్తదని జీవితంలో ఎవరూ ఊహించి ఉండరని, ఒక్క రూపాయి కూడా తిరిగి చెల్లించేది లేకుండా దళితులు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు రూ.10 లక్షలను అందజేస్తుందని విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. దళితబంధు పథకంలో భాగంగా శుక్రవారం సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ హోం గ్రౌండ్‌లో 50 మంది లబ్ధిదారులకు ట్రాక్టర్లు, కార్లను మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల చేతుల మీదుగా పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మార్కెట్లో డిమాండ్ ఉన్న వ్యాపారాలను మాత్రమే ఎంచుకునే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించామన్నారు.

అంతేకాకుండా ఎక్కడైనా వ్యాపారం చేసుకునే వెసులుబాటును కూడా ప్రభుత్వం కల్పించిందని మంత్రి సబితారెడ్డి తెలిపారు. మరోవైపు వ్యాపారాల్లో ఇబ్బందులు ఏర్పడి ఏదైనా అనుకొనిది జరిగితే ఆదుకునేందుకుగాను ప్రత్యేకంగా రక్షణనిధిని ఏర్పాటు చేశారని మంత్రి వెల్లడించారు. అదేవిధంగా దశల వారీగా నియోజకవర్గానికి 2 వేల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున అందజేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, కాలె యాదయ్య, జైపాల్ యాదవ్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎమ్మెల్సీలు జనార్దన్ రెడ్డి, యెగ్గే మల్లేషం, దయానంద్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మెన్ ఆయాచితం శ్రీధర్, జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పూల మార్కెట్‌పై దృష్టి సారించాలని కేటీఆర్ సూచన

హైదరాబాద్, ఏప్రిల్ 15: అంతర్జాతీయ పూల మార్కెట్ ఎగుమతులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్.. వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డికి సూచించారు. చాలా చిన్న దేశాలతో పోల్చితే అంతర్జాతీయ మార్కెట్‌కు పూలను ఎగుమతి చేయడంలో భారత్ వెనుకబడి పోయిందని ట్విట్టర్ వేదికగా మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన ట్వీట్‌పై మంత్రి కేటీఆర్ స్పందించారు.

ప్రపంచ పూల మార్కెట్ విలువ 900 కోట్ల డాలర్లు కాగా, గత ఆర్థిక సంవత్సరంలో 7 కోట్ల 80 లక్షల డాలర్ల విలువైన గులాబీలను మాత్రమే భారత్ ఎగుమతి చేసింది. ఇథియోపియా 19.1 కోట్ల డాలర్లు, కెన్యా 59.6 కోట్ల డాలర్లు ఎగుమతి చేసింది. ఈ దేశాల మాదిరిగా ఇండియా ఎందుకు ఎగుమతులు చేయలేకపోతుందని నాగేశ్వర్ ట్విట్టర్ వేదికగా ప్రశ్నించారు. ఈ ట్వీట్‌పై స్పందించిన కేటీఆర్.. ఇది సీరియస్‌గా ఆలోచించాల్సిన అంశమని, తగిన ప్రణాళికలు రూపొందించాలని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డికి ట్విట్టర్ వేదికగా సూచించారు.

హనుమాన్ శోభాయాత్రకు 8 వేల మంది పోలీసులతో బందోబస్తు

హైదరాబాద్, ఏప్రిల్ 15: హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం హైదరాబాద్ నగరంలో శోభాయాత్ర చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో హనుమాన్ శోభయాత్రకు 8 వేల మంది పోలీసులతో బందోబస్తు చేపట్టనున్నట్లు నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. శోభాయాత్ర కొనసాగే మార్గాన్ని శుక్రవారం మధ్యాహ్నం సీపీ పరిశీలించారు. సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. శోభాయాత్ర కొనసాగే దారిలో భద్రతా సిబ్బంది తనిఖీలు నిర్వహించింది. గౌలిగూడ నుంచి తాడ్‌బండ్ వరకు 12 కిలోమీటర్లు, కర్మాన్‌ఘాట్ నుంచి కోఠి మీదుగా 10 కిలోమీటర్ల మేర మరోయాత్ర కొనసాగనుంది. కోఠిలో ఈ రెండు శోభాయాత్రలు కలుసుకోనున్నాయి.

గౌలిగూడ రామ్ మందిర్ వద్ద హనుమాన్ శోభాయాత్ర ఉదయం 11:30 గంటలకు ప్రారంభం కానుంది. పుత్లిబౌలీ ఎక్స్ రోడ్, కోఠి ఆంధ్రా బ్యాంక్, రామ్ కోఠి ఎక్స్ రోడ్, కాచిగూడ ఎక్స్ రోడ్, వైఎంసీఏ, నారాయణగూడ ఎక్స్ రోడ్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, అశోక్ నగర్ క్రాస్ రోడ్స్, గాంధీ నగర్ టీ జంక్షన్, కవాడిగూడ ఎక్స్ రోడ్, సీజీవో టవర్స్, ఆర్పీ రోడ్, ఓల్డ్ పీఎస్ రామ్‌గోపాల్ పేట్, పారడైజ్ జంక్షన్, సీటీవో, బ్రూక్ బాండ్, మస్తాన్ కేఫ్ మీదుగా తాడ్‌బన్ హనుమాన్ మందిర్ వద్దకు రాత్రి 8 గంటలకు చేరుకోనుంది. ఈ మార్గాల్లో ట్రాఫిక్ మళ్లించనున్నారు.

అసలైన సెక్యులర్ నేత సీఎ

నిశ్శబ్ద రక్తస్రావ రుగ్మతగా హీమోఫీలియా..!

(రేపు 'ప్రపంచ హీమోఫిలియా దినం' సందర్భంగా)

రక్తస్రావానికి, రక్తం గడ్డకట్టే (బ్లడ్ క్లాటింగ్) ప్రక్రియల లోపాలకు సంబంధించిన అనువంశిక రక్త రుగ్మతగా 'హీమోఫిలియా'ను గుర్తిస్తారు. ప్రపంచవ్యాప్తంగా 5 లక్షల మంది హీమోఫిలియాతో బాధ పడుతున్నారని అంచనా. హీమోఫిలియా రుగ్మతతతో బాధ పడే వ్యక్తులకు కోవిడ్-19 వ్యాధి పెద్ద సమస్యగా మారింది. సమాజంలో హీమోఫిలియా, ఇతర సంబంధిత వారసత్వ వ్యాధుల పట్ల సంపూర్ణ అవగాహన కల్పించాలనే సదుద్దేశంతో ప్రతి ఏటా 17 ఏప్రిల్ రోజున 'ప్రపంచ హీమోఫిలియా దినం' నిర్వహిస్తారు. ప్రపంచ హీమోఫిలియా దినం-2022 నినాదంగా 'అందరికి అందుబాటులో (ఆక్సెస్ ఫర్ ఆల్)' అనే సారాంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతోంది. 1969లో 'ప్రపంచ హీమోఫిలియా ఫెడరేషన్' సంస్థను స్థాపించిన 'ఫ్రాంక్ స్నాబెల్' పుట్టిన రోజు 17 ఏప్రిల్ సందర్భంగా ప్రపంచ హీమోఫిలియా దినాన్ని 1989 నుంచి పాటించుట ఆరంభమైంది. హీమోఫిలియా రుగ్మతల చికిత్సలో రక్త మార్పిడి చేయడానికి ఆస్కారం ఉంటుంది. హీమోఫిలియా రుగ్మత ఉన్నట్లు చాలా మందికి తెలియదు. కాబట్టి దీని పట్ల అవగాహన, అవసర వైద్య చికిత్సలు, తీసుకోవలసిన జాగ్రత్తలు తెలుసుకొని ఉండడం మంచిది.

వైవిధ్యభరిత సమాజంలో కుటుంబాలు, పౌర సమాజం, సంరక్షకులు, ఫిజీషియన్స్, శాస్త్ర పరిశోధకులు అందరూ కరోనా కోరల్లో చిక్కడంతో హీమోఫిలియా రుగ్మతలతో పాటు ఇతర అనారోగ్యాలతో బాధ పడే రోగుల వైద్యం ప్రమాదంలో పడింది. హీమోఫిలియా రుగ్మతలకు కరోనా మహమ్మారి పెద్ద సవాళుగా నిలిచినా, 'అందరికీ వైద్యం' అనే సంకల్పంతో ముందుకు సాగడం జరుగుతున్నది. హీమోఫిలియా రుగ్మతతో బాధపడే వ్యక్తులకు చిన్న గాయం ఏర్పడినా రక్తం గడ్డకట్టడం మందగించి రక్తస్రావం కొనసాగి ప్రాణాపాయానికి దారి తీస్తుంది. రక్తం గడ్డకట్టే విధానాన్ని ఆధారంగా చేసుకొని హీమోఫిలియా రుగ్మత రెండు రకాలుగా ఉంటుంది. వీటినే హీమఫిలియా-ఏ, హీమోఫిలియా-బి అని పిలుస్తారు. అధికంగా కనిపించే హీమోఫిలియా-ఏ రుగ్మత దాదాపు ప్రతి 5,000లలో ఒకరికి, హీమోఫిలియా-బి రుగ్మత దాదాపు ప్రతి 20,000లలో ఒకరికి వస్తుందని గమనించారు. హీమోఫిలియాతో పాటు ఇతర రక్త సంబంధ వ్యాధులతో బాధ పడుతున్న 80 శాతం మందికి ఈ వ్యాధి ఉందని కూడా ఏమాత్రం తెలియదు.

అనువంశికంగా సంక్రమించే హీమోఫిలియా వల్ల వ్యక్తికి గాయం అయినపుడు వెంటనే రక్తం గడ్డకట్టడం జరుగదు. దీని ఫలితంగా చిన్న/పెద్ద గాయానికి రక్తస్రావం అధికంగా జరిగి, ప్రమాదకరమైన ప్రాణాపాయ దుస్థితి వస్తుంది. కొన్ని సందర్భాలలో అంతర్గత రక్తస్రావంతో మెదడు, కీళ్ళలో రక్తస్రావం జరిగి ప్రాణాలు కూడా పోవచ్చు. హీమోఫిలియా రుగ్మత అంటువ్యాధి కాదు. కొందరిలో హీమోఫిలియా వలన రక్తస్రావం వారాలుగా కొనసాగవచ్చు. కీళ్ళు, కండరాల్లో రక్తస్రావం జరిగితే కీళ్ళ వాపు, కండరాల నొప్పి కనిపిస్తాయి. హీమోఫిలియా రుగ్మత అవగాహన నిమిత్తం లోగోలు, నినాదాలు, ఇతర కార్యక్రమాలు, కరపత్రాలు, ప్రచార సామాగ్రి, విద్యాలయాల్లో పోటీలు, సామాజిక మాధ్యమాల్లో దృశ్య శ్రవణ ప్రచారాలు పెద్ద ఎత్తున నిర్వహించాలి. జన్యులోపాలతో అనువంశికంగా సంక్రమించే హీమోఫిలియాకు ఎలాంటి సరైన చికిత్స అందుబాటులో లేదు. దీనిని నివారించుట కూడా సాధ్యపడదు.

భారతదేశంలో దాదాపు 2 లక్షల హీమోఫిలియా రోగులు ఉన్నారని, వీరిలో 20,000 మంది మాత్రమే నమోదు చేయబడినారని తెలుస్తున్నది. ప్రతి లక్ష మందిలో నలుగురికి హీమోఫిలియా రుగ్మత కనిపిస్తున్నది. హీమోఫిలియా రుగ్మతను గుర్తించే పరీక్షల్లో ఏపిటిటి/పిటిలు ఉన్నాయి. రుగ్మత ఉందని తెలియని వారికి గాయాలు అయినపుడు అధిక రక్తస్రావం జరిగి ప్రాణాంతకంగా మారుతున్నది. ముఖ్యంగా గ్రామీణ ప్రజలకు హీమోఫిలియా రుగ్మత ఓ శాపంగా మారుతున్నది. హీమోఫిలియా ఉందని తెలియని కారణంగా అంతర్గత/బాహ్య గాయాలు తగిలినపుడు రక్తం గడ్డ కట్టకపోవడంలో అనేక తీవ్ర సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ప్రతి 5,000 మంది శిశువుల్లో ఒకరికి హీమోఫిలియా రుగ్మత ఉండవచ్చని అంచనా. తల్లిలో జన్యువులు మార్పు (మ్యుటేషన్) చెందడంతో పిల్లల్లోకి ఆ జన్యువులు చేరి, హీమోఫిలియా అనువంశికంగా తల్లి నుంచి శిశువుకు సంక్రమిస్తుంది. హీమోఫిలియా లాంటి నిశ్శబ్ద రుగ్మతను త్వరగా గుర్తించడం, తగు జాగ్రత్తలు తీసుకోవడం, అందరికీ అవగాహన కల్పించడం లాంటి చర్యలతో ప్రాణాలను కాపాడుదాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

బాబా సాహెబ్ డా. బి. ఆర్. అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా దేశం ఆయనకు నివాళులర్పించింది

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:బాబా సాహెబ్ డా. బి. ఆర్. అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా దేశం ఆయనకు నివాళులర్పించింది. రాష్ట్రపతి శ్రీ రామ్ నాథ్ కోవింద్ భారతరత్న బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్.కి నివాళులర్పించడంలో దేశానికి నాయకత్వం వహించారు. ఈ రోజు ఉదయం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లోని సంసద్ భవన్ పచ్చికబైళ్లలో ఉన్న బాబా సాహెబ్ డా. బి. ఆర్. అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్రపతి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భారత ఉప రాష్ట్రపతి శ్రీ ఎం. వెంకయ్య నాయుడు, ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ మరియు లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా కూడా భారత రాజ్యాంగ పితామహుడు డాక్టర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి డాక్టర్ వీరేందర్ కుమార్ మరియు ఇతర కేంద్ర మంత్రులు, ప్రముఖులు కూడా భారత రాజ్యాంగ పిలామహుడికి నివాళులర్పించారు.

సామాజిక న్యాయం ఉ సాధికారత మంత్రిత్వ శాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మహమ్మారి మన మధ్యలోనే ఉంది- హెచ్చరించిన డబ్ల్యూహెచ్ వో

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:కరోనా నుండి కొత్త వేరియంట్లు పుట్టుకొస్తూనే ఉన్నాయి. కాగా తాజాగా వెలుగు చూసిన ఒమిక్రాన్ లో రెండు సబ్ వేరియంట్లు. బీఏ 4, బీఏ5 ఆందోళన కలిగిస్తున్నాయి.. కొత్త వేరియంట్ల వ్యాప్తి, ప్రభావంపై దృష్టి సారించింది ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో). కొత్త వేరియంట్ల తీవ్రతపై పర్యవేక్షిస్తోన్న డబ్ల్యూహెచ్‌వో ఇప్పటివరకు ఉన్న ఒమిక్రాన్ ఉపరకాల కంటే ఇవి భిన్నంగా ఏమీ లేవని తెలిపింది.. ఇదే సమయంలో.. ఈ వేరియంట్‌లు కచ్చితంగా మార్పు చెందుతాయని స్పష్టం చేసింది. ఇక కరోనా ముప్పు పూర్తిగా తొలగిపోలేదని.. మనం మహమ్మారి మధ్యలోనే ఉన్నామంటూ వార్నింగ్ ఇచ్చింది డబ్ల్యూహెచ్‌వో.

కోవిడ్‌లో పుట్టుకొచ్చిన ఒమిక్రాన్ వేరియంట్‌కు సంబంధించి రెండు కొత్త వేరియంట్లను ఇప్పటికే గుర్తించాం.. మునుపటి రకాలతో పోలిస్తే తీవ్రతలో ఎటువంటి మార్పులను గుర్తించలేదని చెబుతోంది ప్రపంచ ఆరోగ్య సంస్థ.. కానీ, ఇది మార్పు చెందే అవకాశం లేకపోలేదని హెచ్చరించింది.. వాటి వాస్తవ పరిస్థితులపై ప్రపంచ వ్యాప్తంగా ఉన్న నిపుణులతో కలిసి పనిచేస్తున్నట్టు డబ్ల్యూహెచ్‌వో ప్రతినిధి మారియా వాన్ కెరోవ్ తెలిపారు.

ఆడుకుంటూనే అనంత లోకానికి : ఇసుకలో కూరుకుపోయిన నాలుగేళ్ల చిన్నారి

అమరావతి, ఏప్రిల్ 15:ఇంటి నిర్మాణం కోసం తెచ్చిన ఇసుకలో ఆడుకుంటూ నాలుగేళ్ల చిన్నారి అనంత లోకాలకు వెళ్లిన ఉదంతం పెద్దకడబూరు మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే కల్లుకుంట గ్రామానికి చెందిన కురువ నరసన్న పద్మ దంపతుల కుమార్తె భారతి (4) ఇంటి నిర్మాణం కోసం తెచ్చిన ఇసుకలో ఆడుకుంటూ ఇసుకలో కూరుకుపోయింది. కొద్ది సేపటికి కూతురు కనిపించకపోవడంతో తల్లిదండ్రులు ఇంటి చుట్టుపక్కల వెతికినా ఆచూకి తెలియలేదు. సమీపంలో ఉన్న ఇసుకలో కూరుకుపోయిన చిన్నారి చేయి మాత్రం కనిపించడంతో హుటాహుటిన తల్లిదండ్రులు బయటకు తీశారు. స్థానిక వైద్యులు దగ్గర తీసుకెళ్లగా అప్పటి కే చిన్నారి ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. దీంతో తల్లిదండ్రులు శోక సముద్రంలో మునిగిపోయారు. కళ్ల ముందే ఆడుకునే కూతురును ఇసుక రూపంలో మృత్యువు కబళించిన సంఘటనతో తల్లిదండ్రుల రోధనలు మిన్నంటాయి.

మసీదుల్లో లౌడ్‌స్పీకర్లపై నిషేధానికి రాజ్ ఠాక్రే పట్టు : ఎంఎన్ఎస్‌ను వీడుతున్న ముస్లిం నేతలు

ముంబై, ఏప్రిల్ 14: : మసీదుల్లో లౌడ్‌స్పీకర్లను నిషేధించాలని మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) చీఫ్ రాజ్ ఠాక్రే పట్టుపడుతున్న నేపథ్యంలో శుక్రవారం 30 మందికి పైగా ముస్లిం నేతలు ఎంఎన్ఎస్‌కు రాజీనామా చేశారు. రాజ్ ఠాక్రే హిందుత్వ అనుకూల వైఖరి తీసుకున్న క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 35 మంది స్థానిక నేతలు పార్టీని వీడటం కలకలం రేపింది.

ముంబై, మరాఠ్వాటా, పశ్చిమ మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన ముస్లిం నేతలు పార్టీకి గుడ్‌బై చెప్పారు.

మసీదుల్లో లౌడ్‌స్పీకర్లు నిషేధించాలనే డిమాండ్‌పై రాజ్ ఠాక్రే పట్టుబడుతుండగా ఆయన వైఖరికి నిరసనగా ఎంఎన్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఇర్ఫాన్ షేక్ ఠాక్రేకు తన రాజీనామా లేఖ పంపారు.

ఈ లేఖను ఇర్ఫాన్ షేక్ ఫేస్‌బుక్‌లో షేర్ చేశారు. ఓ వర్గానికి వ్యతిరేంగా విద్వేష వైఖరి తీసుకోవడం మీ వైపు నుంచి మీకు తప్పుగా తోచనప్పటికీ ఏదో జరుగుతోందని తమకు అనిపిస్తోందని తన రాజీనామాను ఆమోదించాలని ఆయన ఆ లేఖలో ఠాక్రేను కోరారు.

కాగా ఏప్రిల్ 2న శివాజీ పార్క్‌లో జరిగిన ర్యాలీలో రాజ్ ఠాక్రే మసీదుల్లో లౌడ్‌స్పీకర్లను నిషేధించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే ఈ చర్య చేపట్టని పక్షంలో మసీదుల వెలుపల తాము భారీ శబ్దాలతో హనుమాన్ చాలీసా వినిపిస్తామని ఆయన హెచ్చరించారు. ఏప్రిల్ 12న థానేలో జరిగిన ర్యాలీలోనూ మే 3లోగా మసీదుల్లో లౌడ్‌స్పీకర్లు తొలగించాలని మహారాష్ట్ర సర్కార్‌కు అల్టిమేటం జారీ చేశారు.

ఆత్మ నిర్భర్ భారత్ దృష్టిని సాకారం చేసే దిశగా పిఎల్ఐ పథకం ఒక అడుగు: కేంద్ర ఆరోగ్య మరియు రసాయనాలు మరియు ఎరువుల మంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:కేంద్ర ఆరోగ్య ఉ కుటుంబ సంక్షేమం మరియు రసాయనాలు ఉ ఎరువుల శాఖ మంత్రి శ్రీ మన్సుఖ్ మాండవియా మాట్లాడుతూ.. ఆత్మ నిర్భర్ భారత్ దార్శనికతను సాకారం చేయడంలో ఫార్మాస్యూటికల్ పరిశ్రమ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈరోజు ముంబైలో ఇండియన్ డ్రగ్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఐడీఎంఏ) డైమండ్ జూబ్లీని పురస్కరించుకుని 'ఇండియన్ ఫార్మా - గ్లోబల్ హెల్త్ కేర్' కార్యక్రమంలో మంత్రి ప్రసంగిస్తూ ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్ వంటి ప్రభుత్వ కార్యక్రమాలు ఈ రంగానికి ఎలా ప్రయోజనం చేకూరుస్తున్నాయో వివరించారు. "ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్ ద్వారా ఔషధాల దేశీయ తయారీని ప్రోత్సహించడం ద్వారా దిగుమతిని తగ్గించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. పిఎల్ఐ పథకం భారతదేశంలో 35 కంటే ఎక్కువ ఉత్పత్తుల తయారీని ప్రారంభించడానికి ఉపయోగపడింది. ఈ సందర్భంగా వచ్చే 25 ఏళ్లకు సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేయాలని ఫార్మాస్యూటికల్ రంగానికి మంత్రి ఉద్బోధించారు.

దేశం 'అమృత్ మహోత్సవ్' జరుపుక ంటున్న సందర్భంగా వజ్రోత్సవాలను జరుపుకుంటున్న భారత డ్రగ్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్‌ను మంత్రి అభినందించారు మరియు ఈ రంగానికి అవసరమైన సహాయాన్ని అందించడానికి ప్రభుత్వం చురుకుగా వ్యవహరిస్తోందని చెప్పారు. "డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్, 1940ని సవరించడం మరియు వ్యాపారాన్ని చేయడం సులభతరం చేయడం ద్వారా ప్రభుత్వం పరిశ్రమకు సహాయం చేస్తోంది. మేము నిర్ణయం తీసుకునే ప్రక్రియలలో పరిశ్రమను భాగస్వామ్యం చేస్తున్నాము. అలాగే వెబ్‌నార్ల శ్రేణి ద్వారా యూనియన్ బడ్జెట్ నిబంధనల అమలుపై పరిశ్రమ మరియు ఇతర వాటాదారులను సంప్రదించడానికి మరియు సంప్రదించడానికి ప్రభుత్వం ప్రయత్నించిందని చెప్పారు

ప్రభుత్వం పేదలు, రైతుల పక్షపాతిగా వ్యవహరిస్తోందని, పరిశ్రమలకు కూడా అనుకూలమని కేంద్ర మంత్రి నొక్కి చెప్పారు. ఫార్మా రంగం యొక్క సహకారాన్ని మంత్రి గుర్తు చేసుకుంటూ, భారతీయ ఫార్మా పరిశ్రమ భారతదేశాన్ని 'ప్రపంచ ఫార్మసీ'గా పేర్కొనే గౌరవాన్ని పొందిందని అన్నారు.

''ప్రభుత్వం ఆరోగ్య రంగాన్ని లాభదాయక పరిశ్రమగా చూడదు. మనం మందులను ఎగుమతి చేసేటప్పుడు 'వసుధైవ కుటుంబం' అనే దృక్పథంతో చేస్తాం. కోవిడ్-19 మహమ్మారి మొదటి వేవ్ సమయంలో భారతదేశం 125 దేశాలకు ఔషధాలను సరఫరా చేసిందని శ్రీ మాండవ్య తెలిపారు. యూనియన్ ఫార్మా సెక్రటరీ శ్రీమతి ఎస్ అపర్ణ ఫార్మా రంగం వృద్ధి మరియు అభివృద్ధికి భరోసా ఇవ్వడంలో ఆవిష్కరణ మరియు పరిశోధనల పాత్రపై దృష్టి సారించారు మరియు ఈ అవకాశాన్ని ఉపయోగించుకునే వ్యూహాన్ని అభివృద్ధి చేయాలని ఐడీఎంఏకి విజ్ఞప్తి చేశారు.

ఆమోదయోగ్యమైన స్థాయి ఔషధ భద్రతను స్థిరమైన ప్రాతిపదికన నిర్మించేందుకు వ్యూహం మరియు ప్రణాళికలలోని సమస్యలను పరిష్కరించాలని ఐడిఎంఏ మరియు పరిశ్రమలకు కార్యదర్శి పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఐడీఎంఏ డైమండ్ జూబ్లీ ఇయర్ వార్షిక ప్రచురణను కేంద్ర మంత్రి డాక్టర్ మాండవ్య, ఇతర ప్రముఖులతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో డా.వి.జి. సోమాని, డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా, డాక్టర్ మన్‌దీప్ కుమార్ భండారీ, ఆరోగ్య మరియు కుటుంబ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి, ఐడీఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ విరంచి షా; శ్రీ భరత్ షా, ఐడీఎంఏ డైమండ్ జూబ్లీ ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్, శ్రీ మహేష్ దోషి, గత జాతీయ అధ్యక్షుడు; శ్రీ మెహుల్ షా ఐడీఎంఏ ప్రధాన కార్యదర్శి పాల్గొన్నారు.

జాతీయ నైపుణ్య మహిళా శిక్షణా సంస్థ విద్యార్థులతో ముచ్చటించిన మంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:మన ప్రజాస్వామిక రాజ్యాంగ ప్రాథమిక లక్షణం సమానత్వం. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌గారి దార్శనికత అయిన సమానత్వం, సమాన అవకాశాలను శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం సబ్ కా సాథ్ , సబ్ కా వికాస్ పై ప్రధానంగా దృష్టిపెట్టడం ద్వారా సాకారం చేస్తున్నది.

అట్టడుగున ఉన్న వ్యక్తిపట్ల కూడా శ్రద్ధ చూపుతూ,-అంత్యోదయ తాత్వికత విధాన నిర్ణయాలకు, లబ్ధిదారులకు వర్తించే అన్ని పథకాలకు మార్గనిర్దేశం వహిస్తున్నది. ప్రతి ప్రభుత్వ పథకంలో సబ్ కా సాథ్ ,సబ్ కా వికాస్ అమలు వంటివి ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ ప్రభుత్వ పాలన, రుజువర్తనలో , దాని ప్రభావంలో నూతన ప్రమాణాలను నెలకొల్పుతున్నదని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి, ఎంటర్ ప్రెన్యూయర్ షిప్ శాఖ సహాయ మంత్రి శ్రీ రాజీవ్ చంద్రశేఖర్ తెలిపారు. బెంగళూరులో మహిళల జాతీయ నైపుణ్యశిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించున్న అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో పాల్గొంటూ ఆయన ఈ మాటలన్నారు.

ఈ కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, టీచర్లు, సంబంధిత అధికారులతో ముచ్చటిస్తూ మంత్రి, భారతరాజ్యాంగ నిర్మాత డాక్టర్. బి.ఆర్ అంబేద్కర్, దేశ నిర్మాణానికి ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చారన్నారు. భారత రాజ్యాంగంలో ప్రముఖంగా ప్రస్తావించిన సమానత్వ ప్రాథమిక హక్కు , మతం, కులం, రంగు, వర్గం, స్త్రీ పురుష తేడా లేకుండా సమానత్వానికి అందరికీ అవకాశం కల్పిస్తున్నదని చెప్పారు. వైవిధ్యత కలిగిన భారతదేశంలో , మనం భౌగోళికంగా వివిధ ప్రాంతాలలో నివశించవచ్చు గాని, మనమందరం ఒక సామాన్య గుర్తింపును, అదే భారతీయులమనే గుర్తింపును కలిగి ఉన్నామన్నారు. అంబేద్కర్ జయంతి, మహావీర జయంతి సందర్భంగా ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

జాతీయ నైపుణ్య శిక్షణ సంస్థ (ఎన్ ఎస్ టిఐ) విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ను మంత్రి సందర్శించారు. పోటీని ఎదుర్కొనేందుకు ఎప్పటికప్పుడు విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగు పెట్టుకుంటుండాలని మంత్రి సూచించారు. ప్రస్తుత కాలంలో డిజిటల్ నైపుణ్యాలను నేర్చుకోవలసి ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని కూడా ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. నైపుణ్యాలకు సంబంధించి మరిన్ని అవకాశాలు కల్పించడం ద్వారా మహిళలకు సాధికారత కల్పించడం అనేది నరేంద్ర మోదీ ప్రభుత్వ గట్టి విశ్వాసమని ఆయన అన్నారు.

సీఎం కేసీఆర్ వల్లే పల్లెలకు జాతీయ స్థాయిలో గుర్తింపు : మంత్రి ఎర్రబెల్లి

మహబూబాబాద్, ఏప్రిల్ 15:: సీఎం కేసీఆర్ వల్లే తెలంగాణ పల్లెలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. జాతీయ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయత్ స్వ శక్తి కరణ్ పురస్కారానికి ఇటీవల ఎంపికైన మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం వెంకటాపురం గ్రామ పంచాయతీ, గ్రామ సర్పంచ్‌ను శుక్రవారం మంత్రి ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా మంత్రి మాటాడుతూ.. పల్లెలు ప్రగతి బాటలో పయనిస్తేనే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రగతి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని, అందువల్లే మన పల్లెలు దేశానికి పట్టుగొమ్మలుగా మారాయని చెప్పారు. ఈ మధ్య ప్రకటించిన జాతీయ ఉత్తమ జిల్లా, మండల, గ్రామ స్థాయిలో 19 అవార్డులు దక్కాయి. అవన్నీ మన గ్రామాలు దేశానికి ఆదర్శంగా మారాయి అనడానికి నిదర్శనం అన్నారు. సీఎం లక్ష్యాన్ని నెరవేర్చేందుకు మంత్రిగా తాను, అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని పేర్కొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే ఇదంతా సాధ్యమైందని మంత్రి చెప్పారు. కరోనా కాలంలో సర్పంచ్ సేవను గుర్తు చేశారు. కరోనాతో మరణించిన వ్యక్తిని స్వయం గా ట్రాక్టర్ పై తీసుకెళ్లి అంతక్రియలు చేశారు అని గుర్తు చేశారు. ఈ ప్రగతిని కొనసాగిస్తూ మరిన్ని అవార్డులు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. సర్పంచ్ లింగన్న గౌడ్ ను అభినందించి, తన సహకారం ఎల్లపుడూ ఉంటుందని మంత్రి వెన్నుతట్టారు.

పేదలకు వరంగా ముఖ్యమంత్రి సహాయనిధి : ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

వరంగల్, ఏప్రిల్ 14:పేదలకు వరంగా ముఖ్యమంత్రి సహాయనిధి మారిందని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన 27 మంది వివిద ఆసుపత్రుల్లో చికిత్స పొంది ముఖ్యమంత్రి సహాయనిధికి అప్లై చేసుకున్న 27 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన రూ.10,97,000 ల విలువ చేసే చెక్కులను శివనగర్ లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అందజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ? పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధితో ఎందరో పేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. సమైక్య పాలనలో పైరవీలు చేస్తే తప్ప ముఖ్యమంత్రి సహాయనిధి డబ్బులు మంజూరయ్యేవి కావు..కానీ స్వరాష్ట్రంలో ముఖ్యమంత్రి సహాయనిధి పారదర్శకంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు అందజేస్తున్నారన్నారు. పేదలకి వరంగా ముఖ్యమంత్రి సహాయనిధి మారిందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలందరూ చల్లగా ఉండాలని మొక్కుకున్నా -సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల

హైదరాబాద్, ఏప్రిల్ 15:తెలంగాణ రాష్ట్ర ప్రజలు అందరూ చల్లగా ఉండాలని అయ్యప్పస్వామిని మొక్కు కున్నట్లు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. ఆయన శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. మంత్రి వెంట కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుట్ల విద్యాసాగర్ రావు , మాజీ స్పీకర్ మధుసూదన్ చారి , మేడారం సింగిల్విండో చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డి , జెడ్పిటిసి బాదినేని రాజేధర్ , మాజీ మార్కెట్ చైర్మన్ ఏలేటి క్రిష్ణారెడ్డి తో పాటు పలువురు ఉన్నారు.

ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణం - పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం జగన్

అమరావతి, ఏప్రిల్ 15:శ్రీరామ నవమిని పురస్కరించుకుని వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. కాగా నేటి రాత్రికి సీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు. ఈ సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి, మంత్రులు, ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు. సాయంత్రం ఒంటిమిట్ట చేరుకుని స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి కల్యాణాన్ని తిలకిస్తారు. అనంతరం కడప వెళ్లనున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిన్న ఉదయం శ్రీరాముడు మోహినీ అలంకారంలో దర్శనమిచ్చాడు. ఒంటిమిట్ట వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. రాములోరి కల్యాణ ఏర్పాట్లను టీటీడీ ఈవో జవహర్‌రెడ్డి పరిశీలించారు. వసతుల కల్పన, అన్నప్రసాదం, ముత్యాల తలంబ్రాల పంపిణీకి సంబంధించి కలెక్టర్ విజయరామరావు, ఎస్పీ అన్బురాజన్, జేఈవో వీరబ్రహ్మం, జేసీ సాయికాంత్ వర్మ, ఇతర సీనియర్ అధికారులతో చర్చించారు.

అధిక వడ్డీలకు - మరొకరు బలి

అమరావతి, ఏప్రిల్ 15: పెడన మండలంలో అధిక వడ్డీలకు మరొకరు బలి అయ్యారు. చెన్నూరు ఎంపిటిసి కాటం నాగమణి భర్త మృతి చెందారు. ఆర్థిక ఒత్తిళ్ల కారణంగా ఎంపీటీసీ భర్త కొండ పురుగుమందు తాగి మృతి చెందారు. దాంతో కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో పెడన ఎస్సై నాగ కళ్యాణి రంగప్రవేశం చేశారు.. కొండ మృతికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభమయింది. మృతదేహాన్ని బందరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆర్థిక ఒత్తిళ్లకు గురి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని గ్రామాల్లో దళితుల ఆందోళన చేశారు. ఎస్సై నాగ కళ్యాణి హామీతో గ్రామస్తులు శాంతపడ్డారు.

హార్థిక్ పటేల్‌ను ఆప్‌లోకి ఆహ్వానించిన గుజరాత్ చీఫ్

అహ్మదాబాద్, ఏప్రిల్ 15:: గుజరాత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ హార్థిక్ పటేల్‌ను ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)లోకి ఆ రాష్ట్ర పార్టీ చీఫ్ గోపాల్ శుక్రవారం ఆహ్వానించారు. అంకిత భావం ఉన్న అలాంటి వ్యక్తులకు కాంగ్రెస్ పార్టీలో స్థానం లేదని విమర్శించారు. గుజరాత్ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలపై హార్థిక్ పటేల్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ నేపథ్యంలో తమ పార్టీలో చేరాలని ఆప్ గుజరాత్ చీఫ్ గోపాల్ మీడియాతో అన్నారు. 'హార్థిక్ పటేల్‌కు కాంగ్రెస్‌లో అసంతృప్తిగా అనిపిస్తే, ఆప్ వంటి ఇష్టమైన పార్టీలో ఆయన చేరవచ్చు. కాంగ్రెస్ అధిష్ఠానికి ఫిర్యాదు చేసి సమయం వృథా చ

ట్రాఫిక్ చలాన్ల డిస్కౌంట్ గడువు నేటితో ఆఖరు

హైదరాబాద్, ఏప్రిల్ 15:ట్రాఫిక్ చలాన్ల డిస్కౌంట్ గడువు నేటితో ముగియనుంది. కాగా ఈ ఆఫర్ ని మార్చి 1న ప్రారంభించింది తెలంగాణ సర్కార్. మార్చి 31వరకు గడువు ముగిసినా..వాహనదారుల విజ్ఞప్తుల మేరకు ఆ గడువును ఏప్రిల్ 15 వరకు పొడిగించారు. ఇక ఏప్రిల్ 15 చివరి తేదీ, మళ్లీ గడువు పొడించబోమని ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. అయితే ఇప్పటి వరకు 3 కోట్ల పెండింగ్ చలాన్లు క్లియర్ అయ్యాయి. పెండింగ్ చలాన్ల క్లియరెన్స్‌తో ప్రభుత్వానికి రూ. 300 కోట్ల ఆదాయం సమకూరింది. 65 శాతం పైగా పెండింగ్ చలాన్లను వాహనదారులు క్లియర్ చేశారు.ద్విచక్ర, త్రిచక్ర వాహనాలకు, తోపుడు బండ్ల వారికి పెండింగ్ చలాన్ మొత్తంలో 25 శాతం చెల్లిస్తే..75 శాతం మాఫీ చేస్తామని పేర్కొన్న సంగతి తెలిసిందే. ఆర్టీసీ డ్రైవర్లకు 30శాతం, కార్లకు, ఇతర వాహనాలకు (లైట్‌మోటార్ వెహికిల్స్, హెవీ మోటార్ వెహికిల్స్‌కు) 50 శాతం చెల్లిస్తే చాలని తెలిపారు. మాస్క్‌లు లేని కేసులలో విధించిన చలాన్లలో రూ.100 చెల్లిస్తే రూ.900 మాఫీ అవుతుందన్నారు.

అక్కిరెడ్డిగూడెం ఫ్యాక్టరీని సందర్శించిన - ప్రభుత్వ మాజీ విప్ చింతమనేని

అమరావతి, ఏప్రిల్ 15:ప్రభుత్వ మాజీ విప్, మాజీ దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెం ఫ్యాక్టరీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇండస్ట్రియల్ ఏరియాలో ఉండవలసిన ఇలాంటి ఫ్యాక్టరీలు గ్రామాల మధ్యన ఉండటం సమీక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ చేసి ఈ ఫ్యాక్టరీని ఇక్కడ ఉంచాలా లేదా అనే కోణంలో ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన డిమాండ్ చేశారు. విశాఖపట్నంలో ఒక ఫ్యాక్టరీ లో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన బాధితులకు అందించిన నష్టపరిహారం ..ఈ ఫ్యాక్టరీలో ఈ ప్రమాదంలో గాయపడిన, మరణించిన కుటుంబాలకు అదే రీతిలో నష్టపరిహారం చెల్లించాలని తెలుగుదేశం పార్టీ డిమాండ్ చేస్తుందని ప్రభాకర్ అన్నారు. ఫ్యాక్టరీలో జరిగిన అగ్ని ప్రమాదాన్ని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఈ ప్రమాదంలో దుర్మరణం చెందిన బొప్పూడి కిరణ్ కుటుంబాన్ని చింతమనేని ప్రభాకర్ పరామర్శించారు. మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ లు దేవినేని డాలరాం, కాపా శ్రీనివాసరావు, ముసునూరు మాజీ జెడ్పీటీసి చిలుకూరు వెంకటేశ్వరావు, నూజివీడు తెలుగు రైతు సంఘం అధ్యక్షులు అక్కినేని చంద్రశేఖర్, పార్టీ ప్రజాప్రతినిధులు. పార్టీ నాయకులు. కార్యకర్తలు ,పాల్గొన్నారు.

కోర్టులో డాక్యుమెంట్ల చోరీ తీవ్రమైన విషయం : టీడీపీ నేత పయ్యావుల కేశవ్

అమరావతి, ఏప్రిల్ 15: నెల్లూరు కోర్టులో చోరీ వ్యవహారాన్ని హైకోర్టు సీరియస్‌గా తీసుకోవాలని టీడీపీ నేత పయ్యావుల కేశవ్ కోరారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఏ1 గా ఉన్న కేసులో పత్రాల చోరీ జరగడం కుట్రలో భాగమేనని ఆయన వెల్లడించారు. కేసులో నిందితుల బెయిల్ రద్దు చేసి కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టాలని ఆయన కోరారు . కోర్టులో చోరీ ఘటనలను ఆదిలోనే అరికట్టాలని అన్నారు. లేదంటే భవిష్యత్తులో నేరగాళ్లంతా ఇలాగే ప్రవర్తించే ప్రమాదముందని పేర్కొన్నారు.

కోర్టులో చోరీ ఘటన ఆధారాల ధ్వంసం కిందకు వస్తుందని తెలింపారు. కోర్టులో చోరీ దేశంలో ఎక్కడా జరగలేదని ఆరోపించారు. ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి విచారణ జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఇక రాజకీయాల్లో నవ్వులు పూయిస్తా : మంత్రి రోజా

అమరావతి, ఏప్రిల్ 15: దశాబ్దకాలం పాటు తెలుగు ప్రేక్షకులకు జబర్దస్త్ నవ్వుల ద్వారా దగ్గరయ్యాయని ఇక రాజకీయాల్లో నవ్వులు పూయిస్తానని ఏపీ టూరిజం శాఖ మంత్రి రోజా తెలిపారు. వైఎస్సార్ కడప జిల్లా ఇడుపుల పాయలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనేక మంది తనను ఇక జబర్దస్‌లో పనిచేయారా అని అడుతున్నారని తెలిపారు. పది మందికి ఉపయోగంకోసం ఒకటి వదులుకోక తప్పదని ఆమె చెప్పారు.

ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో మంత్రిగా చోటు దక్కించుకున్న రోజా పలు జిల్లాలో పర్యటిస్తున్నారు. చిత్తూరు జిల్లా నగరి నియోజకవర్గం నుంచి రెండుసార్లు వైసీపీ ఎమ్మెల్యేగా గెలిచారు. అటు ప్రజాప్రతినిధిగా కొనసాగుతూనే జబర్దస్త్ కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా ముందుకు నడిపించారు. 2019లో ఏపీలో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వ తొలి కేబినెట్‌లో స్థానం దక్కుతుందన్న ఆమెకు నిరాశే ఎదురైంది. జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తొలిరోజుల్లోనే రెండున్నర సంవత్సరాల తరువాత నూతన మంత్రివర్గాన్ని ఏర్పాటు చేస్తానని చేసిన ప్రకటన మేరకు మంత్రులందరి చేత రాజీనామా చేయించి అందులో 11 మంది పాతవారిని, 14 మందిని కొత్తవారిని కొత్త మంత్రివర్గంలోకి తీసుకున్నారు.

అయితే ఈనెల 10 న మధ్యాహ్నం వరకు మంత్రుల జాబితాలో రోజా పేరు లేకపోవడంతో ఆమె నిరాశగా హైదరాబాద్ లోనే ఉండిపోయారు. అనూహ్యంగా ఆమె పేరు తెరపైకి రావడంతో ఆమె సంతోషాన్ని పట్టపగ్గాలు లేకుండాపోయాయి. మంత్రిగా బాధ్యతలు చేపట్టక ముందే ఆమె జబర్దస్త్‌కు గుడ్‌బై చెప్పారు .

ఏపీ ప్రభుత్వంపై మరోసారి విరుచుకుపడ్డ వైసీపీ ఎంపీ..

అమరావతి, ఏప్రిల్ 15: ఏపీకి చెందిన నరసాపురం వైసీపీ పార్లమెంట్ సభ్యుడు రఘురామరాజు మరోసారి వైసీపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఏపీ ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలపై ఢిల్లీలో మీడియా సమావేశంలో మాట్లాడారు. పేద వాడికి ఆహార భద్రతకు భరోసాగా ఉన్న ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీరం చేస్తుందని మండిపడ్డారు. ఆహార భద్రత పథకానికి ఆహారం ఇవ్వడం మానేసి డబ్బు ఇస్తామనడమేంటని ప్రశ్నించారు. కేంద్రం పేదవాడికి ఆహారం అందించేందుకు ప్రతి కిలోకు రూ. 28కు అందజేస్తుందని వివరించారు.

బియ్యం బదులు నగదు పంపిణీ చేస్తే ఒక్కరోజుల్లోనే ఆ డబ్బును వృథా చేస్తారని వివరించారు. కనీసం బియ్యం ఉంటే గంజి కాచుకుని తింటరాని ఆయన అన్నారు. అన్ని ధానాలకంటే అన్నదానం గొప్పదని పేర్కొన్నారు. టీడీపీ హయాంలో నెలకొల్పిన అన్న క్యాంటీన్ల ద్వారా అనేక మందికి కడుపు నిండా అన్నదానం దొరికేదని అటువంటి స్కీంను వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని ప్రభుత్వం ఎత్తివేస్తుందని ఆరోపించారు.

ఆకలి విలువ ఆకలితో ఉన్న వారికే తెలుసని, పేదవాడికి పట్టెడన్నం పెట్టే అన్న క్యాంటీన్లు తీసేశారని మండిపడ్డారు. ఇప్పటికైనా ఏపీ సీఎం జగన్, నూతన మంత్రులు ఆహార భద్రతను పేదవాడి నుంచి దూరం చేయవద్దని సూచించారు.

న్యూఢిల్లీలో 'ప్రధానమంత్రి సంగ్రహాలయం' ప్రారంభించిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ న్యూఢిల్లీలో 'ప్రధానమంత్రి సంగ్రహాలయం' ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని ప్రసంగిస్తూ– దేశవ్యాప్తంగా నేడు జరుగుతున్న వివిధ పండుగలను గుర్తుచేశారు. అలాగే బాబాసాహెబ్ అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తూ.. "బాబాసాహెబ్ రాజ్యాంగానికి ప్రధాన రూపశిల్పి కాగా, ఆ రాజ్యాంగమే మన పార్లమెంటరీ వ్యవస్థకు పునాదిగా ఉంది. ఈ పార్లమెంటరీ వ్యవస్థ నిర్వర్తించాల్సిన ప్రధాన బాధ్యత దేశ ప్రధానమంత్రి పదవిపై ఉంది. ఈ నేపథ్యంలో 'ప్రధానమంత్రి ప్రదర్శనశాల'ను జాతికి అంకితం చేసే అవకాశం ఇవాళ నాకు లభించడం నిజంగా నా అదృష్టం" అన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన పూర్వ ప్రధాన మంత్రుల కుటుంబాలను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. అలాగే "దేశం స్వాతంత్ర్య అమృత మహోత్సవాలు నిర్వహించుకుంటున్న తరుణంలో ఈ ప్రదర్శనశాల ఆవిర్భావం గొప్ప ప్రేరణగా నిలిచింది. ఈ 75 ఏళ్లలో దేశం ఎన్నో గర్వించదగిన క్షణాలను చూసింది. చరిత్ర గవాక్షం నుంచి చూసినపుడు ఈ క్షణాలకు సాటిలేని ప్రాముఖ్యం ఉన్నదనే వాస్తవం స్పష్టమవుతుంది" అని ప్రధానమంత్రి నొక్కిచెప్పారు.

స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచీ పాలన సాగించిన అన్ని ప్రభుత్వాలూ దేశాభివృద్ధికి చేసిన కృషిని ప్రధానమంత్రి ప్రశంసాపూర్వకంగా పునరుద్ఘాటించారు. "స్వతంత్ర భారతంలో ఏర్పడిన ప్రతి ప్రభుత్వమూ దేశాన్ని నేటి ఉన్నత స్థితికి చేర్చడంలో తన వంతు కృషి చేసింది. ఇదే విషయాన్ని నేను ఎర్రకోట పైనుంచి కూడా పలుమార్లు ప్రకటించాను" అని ప్రధానమంత్రి గుర్తుచేశారు. అలాగే "ప్రతి ప్రభుత్వ భాగస్వామ్య వారసత్వానికీ ఈ ప్రదర్శనశాల ఓ సజీవ తార్కాణం" అని ఆయన అన్నారు. రాజ్యాంగ నిర్దేశిత ప్రజాస్వామ్య లక్ష్యాల సాధనలో దేశాన్ని పాలించిన ప్రతి ప్రధానమంత్రీ ఎనలేని సహకారం అందించారని ప్రధాని అన్నారు. "వారందర్నీ గుర్తుచేసుకోవడమంటే స్వతంత్ర భారత ప్రగతి పయనాన్ని అధ్యయనం చేయడమే. ఈ మేరకు ఈ ప్రదర్శనశాలకు వచ్చే ప్రజలకు దేశ మాజీ ప్రధానుల కృషి, వారి నేపథ్యం, వారి సంఘర్షణలు, సృజనాత్మకత గురించి తెలిసే ఉండవచ్చు" అని ఆయన పేర్కొన్నారు.

దేశ ప్రధానులలో చాలామంది సామాన్య కుటుంబాల నుంచి వచ్చినవారే కావడం తనకెంతో గర్వకారణమని ప్రధానమంత్రి చెప్పారు. అత్యంత పేద, రైతు కుటుంబాలకు చెందిన ఇలాంటి నాయకులు ప్రధాని పదవిని అలంకరించడం భారత ప్రజాస్వామ్యం, దాని సంప్రదాయాలపైగల విశ్వాసానికి మరింత బలమిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు "సాధారణ కుటుంబీకుడైన వ్యక్తి కూడా భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నత స్థానానికి చేరగలరనే విశ్వాసం దేశంలోని యువతలో ఉంది" అని శ్రీ మోదీ అన్నారు. ఈ నేపథ్యంలో 'ప్రధానమంత్రి సంగ్రహాలయం' యువతరం అనుభవాన్ని ఇంకా విస్తృతం చేయగలదని ప్రధాని ఆకాంక్షించారు. స్వతంత్ర భారతావని కీలక సందర్భాల గురించి యువత ఎంత ఎక్కువ తెలుసుకుంటే, వారి నిర్ణయాలు అంత సాపేక్షంగా ఉంటాయన్నారు.

ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లుగా భారతదేశానికిగల గుర్తింపు ప్రస్తావిస్తూ– "కాలమాన పరిస్థితులకు అనుగుణంగా నిరంతర పరిణామశీలమనది కావడమే భారత ప్రజాస్వామ్యం గొప్పదనం. ప్రతి శకంలో, ప్రతి తరంలో ప్రజాస్వామ్యాన్ని మరింత ఆధునికం, శక్తిమంతం చేయడానికి నిర్విరామ కృషి జరిగింది. ఒకటిరెండు మినహాయింపులు తప్ప ప్రజాస్వామ్య విధానంతో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం భారతదేశానికి గర్వకారణమని ప్రధానమంత్రి అన్నారు. "ఆ మేరకు మనవంతు కృషితో ప్రజాస్వామ్యాన్ని ఇంకా బలోపేతం చేయాల్సిన బాధ్యత మనపైన కూడా ఉంది" అని ఆయన స్పష్టం చేశారు. భారతీయ సంస్కృతిలోని సమగ్ర, అనుకూలాంశాలను ప్రముఖంగా ప్రస్తావిస్తూ– ఆధునికతను, సరికొత్త ఆలోచనలను స్వీకరించే దిశగా మన ప్రజాస్వామ్యం మనకు ప్రేరణనిస్తుందని శ్రీ మోదీ అన్నారు.

భారతదేశం ఉజ్వల చరిత్ర, సంపన్నశకాన్ని గుర్తుచేసుకుంటూ– భారతదేశ వారసత్వం, వర్తమానం సంబంధిత ముఖచిత్రాన్ని సవ్యంగా ఆవిష్కరిస్తూ అవగాహన పెంచాల్సిన అవసరాన్ని ప్రధానమంత్రి నొక్కిచెప్పారు. దోపిడీకి గురైన వారసత్వ సంపదను విదేశాల నుంచి తిరిగి తీసుకురావడం, సముజ్వల వారసత్వ ప్రదేశాలకు గుర్తింపు, జలియన్‌వాలాబాగ్ స్మారకం, బాబాసాహెబ్ స్మారక పంచతీర్థం, స్వాతంత్ర్య సమరయోధుల ప్రదర్శనశాల, గిరిజన చారిత్రక ప్రదర్శనశాల వంటివి స్వాతంత్ర్య సమరయోధుల జ్ఞాపకాలను భద్రపరిచేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి నిదర్శనాలని ఆయన విశదీకరించారు.

అనేక హస్తాలు చక్రాన్ని పట్టుకున్నట్లున్న ప్రదర్శనశాల చిహ్నం (లోగో) గురించి ప్రధాని వ్యాఖ్యానిస్తూ– ఈ చక్రం 24 గంటల నిరంతర ప్రవంతికి, ప్రజా శ్రేయస్సుపై దృఢసంకల్పానికి, అకుంఠిత దీక్షకు చిహ్నమని వివరించారు. ఈ దృఢ సంకల్పం, చైతన్యం, శక్తి రాబోయే 25 ఏళ్లలో భారతదేశ ప్రగతికి నిర్వచనంగా నిలుస్తాయని ప్రధానమంత్రి నొక్కిచెప్పారు. అలాగే మారుతున్న ప్రపంచ క్రమాన్ని, ఆ దిశగా భారతదేశానికి పెరుగుతున్న ప్రాధాన్యాన్ని ప్రధానమంత్రి సుస్పష్టం చేశారు. "నేడు ఓ కొత్త ప్రపంచ క్రమం ఆవిష్కృతమవుతుండగా ప్రపంచమంతా ఆశతో.. నమ్మకంతో భారత్‌వైపు చూస్తోంది, ఈ అంచనాలకు తగినట్లుగా ఎదగడానికి భారత్ మరింత కృషి చేయాల్సిన అవసరం ఉంది" అని శ్రీ నరేంద్ర మోదీ ప్రజలకు పిలుపునిచ్చారు.

మాది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం : మంత్రి సబితారెడ్డి

రంగారెడ్డి ఏప్రిల్ 15:మాది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వమని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో దళిత బంధు పథకంలో ఎంపికైన లబ్ధిదారులకు సరూర్ నగర్ లోని విక్టోరియా మెమోరియల్ హోమ్ గ్రౌండ్ లో జరిగిన యూనిట్ల పంపిణీ కార్యక్రమానికి మంత్రి సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు.

మూసి రివర్ ఫ్రంట్ చైర్మన్ సుధీర్ రెడ్డి, జడ్పీ చైర్ పర్సన్ అనిత రెడ్డి, ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, కాలే యాదయ్య, జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీలు దయనంద్, ఎగ్గే మల్లేశం, కలెక్టర్ అమోయ్ కుమార్ తో కలిసి 347 మంది లబ్ధిదారులకు యూనిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ?. భారత రత్న డాక్టర్ బి ఆర్ అంబెద్కర్ స్ఫూర్తితో దళిత బంధు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు.

దళిత బంధు దేశానికి ఆదర్శమని..దమ్ముంటే మీ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఈ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అట్టడుగున ఉన్న దళిత కుటుంబాలను అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ఒక ఆపద్బాంధవునిగా ముఖ్యమంత్రి కేసీఆర్ నిలబడ్డారనీ హర్షం వ్యక్తం చేశారు. రక్షణ నిధి దళిత బంధు లబ్ధిదారులకు భవిష్యత్తులో అండగా ఉంటుందని తెలిపారు. నియోజకవర్గానికి 2 వేల మందికి దళిత బంధు ఈ ఆర్థిక సంవత్సరంలో అందిస్తామని వెల్లడించారు.

నిషేధిత పదార్థాల రవాణాపై ఉక్కుపాదం : ఎస్పీ శరత్ చంద్ర పవార్

వరంగల్, ఏప్రిల్ 15:జిల్లాలో అక్రమ వ్యాపారాలకు తావులేదని, నిషేధిత పదార్థాలు రవాణ చేసినా, క్రయ విక్రయాలు జరిపినా చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పీడీయాక్టులు కూడా ప్రయోగిస్తామని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ హెచ్చరించారు. మరిపెడ మండలంలో పోలీసులకు పట్టుబడిన నల్లబెల్లం, పటిక కు సంబంధించిన వివరాలను శుక్రవారం తొర్రుర్ పోలీస్ స్టేషన్‌లో వెళ్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఈనెల 14 తేదీన మరిపెడ మండల కేంద్రంలోని రాజీవ్ సెంటర్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా టీఎస్26టీ4416 నంబరు గల ట్రాలీని ఆపి తనిఖీ చేయగా అందులో 110 బస్తాల్లో నిషేధిత నల్లబెల్లం సుమారు 55క్వింటాలు, 6బస్తాల పటిక, అదే విధంగా మండల పరిధిలోని కుడ్యతండా శివారులో కేఏ 07బీ3358 నంబరు గల ట్రాలీ తనిఖీ చేయగ 4క్వింటాళ్ల నిషేధిత నల్లబెల్లం, 2బస్తాల పటిక రవాణ చేస్తున్నట్లు గుర్తించటం జరిగింది.

మొత్తం 59 కింటాళ్ల నల్లబెల్లం, 4కింటాల పటిక విలువ సుమారు రూ.5.90లక్షలుగా ఉంటుందన్నారు. వీటికి సంబంధించి 12మందిపై కేసు నమోదు చేయగా.. ముగ్గురు అదుపులో ఉన్నారని, తొమ్మిది మంది పరారీలో ఉన్నట్లు తెలిపారు.

పట్టుబడిన వారిలో మరిపెడ మండలం బాల్యతండాకు చెందిన బానోత్ సంతోష్, గాలివారి గూడెం గ్రామానికి చెందిన టిలావత్ రమేష్, నర్సింహులపేట మండలం బానోత్ సలీం ఉండగా పరారీలో వీరారం గ్రామానికి చెందిన దారవత్ రాందాస్, బాల్యతండాకు చెందిన జర్పుల నెహ్రూ, వెంకట్యతండాకు చెందిన గుగులోత్ రత్న కుమార్, పర్కజాల్ తండాకు చెందిన బానోత్ కిషోర్, గూడూరు మండలం పొనుగోడుకు చెందిన చిట్టిబాబు (బానోత్ కృష్ణ), చిన్నగూడూరు మండలం బావోజి తండాకు చెందిన ధరంసోత్ వీరేష్, నర్సింహులపేట మండలం కొమ్ములవంచ గ్రామానికి చెందిన గుగులోత్ వీరన్న, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూర్ జిల్లా మదనపల్లికి చెందిన బోగం రాజు, అదే మదనపల్లికి చెందిన బోగం శ్రీనివాస్ ఉన్నారని, త్వరలోనే అందరిని అరెస్టు చేస్తామని ఎస్పీ పేర్కొన్నారు. మరిపెడ పరిధిలో అక్రమ నల్లబెల్లం రవాణపై ఎప్పటికప్పుడు ఉక్కుపాదం మోపుతున్న ఎస్ఐ ప్రవీన్ కుమార్, సిబ్బంది క్రాంతి కుమార్, స్టేషన్ డ్రైవర్ సందీప్‌లను ఎస్పీ అభినందించి రివార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ యోగేష్, తొర్రుర్ డీఎస్పీ వెంకటరమణ రెడ్డి, మరిపెడ సీఐ ఎన్ సాగర్, తొర్రుర్ సీఐ సత్యనారాయణ, తొర్రుర్ ఎస్ఐ గుండ్రాతి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల శిక్షణ కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు

హైదరాబాద్, ఏప్రిల్ 15: టాలెంట్ ఉన్నా సరైనా అవకాశాలు లేక చాలా మంది విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించడంలో వెనుకబడి పోతున్నారు. ఇలాంటి వారికోసం తెలంగాణ ఉన్నత విద్యామండలి ముందు చూపుతో ఆలోచన చేసి యూనివర్శిటీల్లో కోచింగ్ కేంద్రాలు పెట్టాలని వర్శిటీ వీసీల సమావేశంలో గత ఫిబ్రవరి నెలలో నిర్ణయించింది. ఈమేరకు రాష్ట్రంలో సాంప్రదాయ కోర్సులను అందించే ఉస్మానియా, కాకతీయ, శాతవాహన, తెలంగాణ, మహాత్మాగాంధీ, పాలమూరు యూనివర్శిటీల్లో చదివే విద్యార్థుల కోసం కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసేందుకు నిధులను కూడా మంజూరు చేసింది. ఆరు వర్శిటీలకు కలిపి రూ.18 లక్షలను మంజూరు చేసింది. ఇందులో ఉస్మానియా వర్శిటీకు రూ.5 లక్షలు, కాకతీయ వర్శిటీకు రూ.4 లక్షలు, మిగతా నాలుగు వర్శిటీలకు కలిపి రూ.9 లక్షల నిధులను విడుదల చేసింది.

ఈ నిధులను ఫిబ్రవరి నెలలో మంజూరు చేసినట్లు సమాచారం. నిధులు విడుదలై నెలలు గడుస్తున్నా ఇంత వరకూ వర్శిటీల్లో పోటీ పరీక్షలకు సంబంధించిన కోచింగ్ కేంద్రాలు అందుబాటులోకి రాలేదు. అయితే ఒక్క పాలమూరు యూనివర్శిటీ క్యాంపస్‌లో మాత్రం జనవరి నెల నుంచే వర్శిటీ విద్యార్థులకు ఉచిత కోచింగ్‌ను ప్రారంభించారు. కానీ మిగతా ఐదు వర్సిటీల్లో మాత్రం కోచింగ్ కేంద్రాలు ఇంకా అందుబాటులోకి రాలేదు. ఉద్యోగ ప్రకటనలకు ముందే కోచింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వాలనే డిమాండ్ విద్యార్థుల నుంచి వస్తోంది. ఈ నెలలో గ్రూప్-1 నోటిఫికేషన్ కూడా వెలువడ నుంది. ఇంకెప్పుడు ఉచిత కోచింగ్‌ను ప్రారంభిస్తారని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు.

ఉస్మానియా వర్శిటీలో సివిల్ సర్వీస్ అకాడమీని స్థాపించబోతున్నారు. మిగతా వర్శిటీల్లో గ్రూప్స్, పోలీస్ ఉద్యోగాలకు సంబంధించిన కోచింగ్ కేంద్రా లను ఏర్పాటు చేస్తున్నారు. అయితే ఇవి అందుబాటులోకి రావడానికి ఇంకా కొంత సమయం పట్టే అవకాశం ఉంది. సివిల్ సర్వీసెస్, గ్రూప్స్, పోలీస్, ఆర్ఆర్‌బీ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, బ్యాంక్ ఎగ్జామ్స్ ఇతర పోటీ పరీక్షలకు ఏటా లక్షల మంది అభ్యర్థులు ప్రిపేర్ అవుతూ ఉంటారు. తమ కలల కొలువును సాకారం చేసుకోవడానికి కొందరు రూ.లక్షలు ఖర్చు చేసి కోచింగ్ సెంటర్లలో కోచింగ్ తీసుకుంటుంటే? మరి కొందరు మాత్రం కోచింగ్‌కు డబ్బుల్లేక యూని వర్సిటీ లైబ్రరీల్లో స్వతహాగానే ప్రిపేర్ అవుతుంటారు. ఇలాంటి వారికోసం రాష్ట్రంలోని 6 ప్రధాన యూని వర్సిటీల్లో చదు వుతున్న విద్యార్థులకు కోచింగ్ అందిం చేందుకు విద్యా మండలి సెంటర్లను ఏర్పా టు చేస్తోంది. కాకతీయ వర్సిటీ క్యాంపస్‌లో 200 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు వీలుగా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

శాతవాహన వర్సిటీలోనూ విద్యార్థు లకు అన్ని పోటీ పరీక్షలకు ఉచి తంగా కోచింగ్ అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే శిక్షణ తీసుకునేందుకు ప్రస్తుతానికైతే ఎలాంటి స్క్రీనింగ్ టెస్టు లేకుండానే విద్యార్థులకు కోచింగ్ ఇవ్వాలని వర్సిటీలు ప్రాథమికంగా నిర్ణ యించినట్లు తెలిసింది. మొదట వర్శిటీలోని విద్యా ర్థులకు కోచింగ్ ఇచ్చిన తర్వాత వర్శిటీ అనుబంధ కాలేజీల్లోని విద్యార్థులకు సైతం కోచింగ్ ఇవ్వనున్నారు. ఒక్కో వర్సిటీలో బ్యాచ్‌కు సుమారు 100 నుంచి 200 మంది విద్యార్థులకు కోచింగ్ ఇచ్చేందుకు వర్శిటీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. వచ్చే దరఖాస్తుల సంఖ్యను బట్టి విద్యార్థులకు బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇవ్వ నున్నారు. సబ్జెక్టులను బోధించేందుకు వర్శిటీ ప్రొఫెసర్లతో పాటు బయటి నుంచి కూడా ప్రత్యేక ఫ్యాకల్టిటిని తీసుకొచ్చి విద్యార్థులకు కోచింగ్ ఇప్పించనున్నారు.

రాజస్థాన్‌లో వింత వ్యాధి.. ఐదు రోజుల్లో ఏడుగురు చిన్నారులు మృతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:రాజస్థాన్ రాష్ట్రంలో వింత వ్యాధి కలకలం రేపుతోంది. అయిదు రోజుల్లో ఏడుగురు చిన్నారులు చనిపోవడం అందరిలో ఆందోళన కలిగిస్తోంది. సిరోహి జిల్లాలోని ఫులాబాయి ఖేడా, ఫులాబెర్ గ్రామాల్లో రెండు నుంచి 14 ఏళ్ల వయసున్న పిల్లలు చనిపోయారు. ఈ నెల 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జ్వరం, మూర్ఛ వంటి లక్షణాలతో ఏడుగురు పిల్లలు చనిపోయినట్లు ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ జగేశ్వర ప్రసాద్ తెలిపారు. చిన్నారుల మృతికి కారణం ఏమిటన్నది తెలియలేదన్నారు. వైరల్ డిసీజ్ కారణం కావచ్చని, అయితే.. రక్త నమూనాల పరీక్షల రిపోర్టులు వస్తే గానీ దీని గురించి ఏమీ చెప్పలేమన్నారు. కాగా, ఈ మిస్టరీ వ్యాధి సోకిన పిల్లల్లో జ్వరం, మూర్ఛ వంటి లక్షణాలు కనిపించిన ఒక రోజులోనే చనిపోయినట్లు ప్రసాద్ తెలిపారు.

ఐదేండ్ల కుమారుడు ఉదయం 5 గంటలకు నిద్ర లేచి మంచినీరు అడిగాడని, అనంతరం అతడికి మూర్ఛ వచ్చినట్లు ఓ బాలుడి తల్లి తెలిపిందన్నారు. ఉదయం 8 గంటలకు వాంతులు చేసుకుని ఆ తర్వాత పిల్లవాడు చనిపోయినట్లు ఆమె చెప్పిందన్నారు. మరోవైపు చనిపోయిన ఏడుగురు పిల్లల్లో ముగ్గురు స్థానికంగా తయారు చేసిన ఐస్ క్రీం తిన్నట్లు తమకు తెలిసిందని ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ జగేశ్వర ప్రసాద్ తెలిపారు.

మరో ఇద్దరు కూడా ఆ ఐస్ తిన్నట్లుగా అనుమానం వ్యక్తం చేశారని, అయితే ఎవరూ దీనిని చూడలేదన్నారు. విషాహారం వల్ల కూడా ఇంత వేగంగా మరణాలు సంభవించవని ఆయన అభిప్రాయపడ్డారు. జైపూర్, జోధ్‌పూర్ నుంచి వైద్య బృందాలను ఆయా గ్రామాలకు పంపుతున్నట్లు సిరోహి జిల్లా కలెక్టర్ తెలిపారు. పరిస్థితిని గమనిస్తున్నామని, 300 ఇళ్ల నుంచి 58 మంది పిల్లల రక్త నమూనాలను సేకరించి పరీక్ష కోసం ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు.

లారీని ఢీకొట్టిన కారు.. ఇద్దరికి తీవ్ర గాయాలు, మరొకరి పరిస్థితి విషమం

కరీంనగర్ , ఏప్రిల్ 15: (నేటినిజం ప్రతినిధి): పెద్దపల్లి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వెళ్తూ ఓ కారు లారీని ఢీ కొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పెద్దపల్లి మండలం రాఘవపూర్ శివారులో ఇవ్వాల

ఎపిక్ ఫౌండేషన్ ఏర్పాటు

హైదరాబాద్, ఏప్రిల్ 15:జాతీయ ప్రాముఖ్యం గల ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కోసం భారతీయ ఉత్పత్తుల, భారతీయ బ్రాండ్ల స్పష్ట ద్వారా భారతీయ ఎలక్ట్రానిక్స్ పునరుజీవం లక్ష్యంగా లాభాపేక్ష రహిత సంస్థ ఇపిఐసి(ఎపిక్) ఫౌండేషన్ను హెచ్సిఎల్ వ్యవస్థాపకుడు డాక్టర్ అజయ్ చౌదరీ హెచ్సిఎల్ సహా వ్యవస్థాపకుడు అర్జున్ మల్హోత్రా, సెమికండక్టర్ పరిశ్రమ వెటరన్ డాక్టర్ సత్యగుప్తాలతో కలసి స్థాపించారు.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వికె సరస్వత్ ముఖ్య అతిథిగా హాజరు కాగా ఢిల్లీ డైలాగ్, డెవలప్మెంట్ కమిషన్ వైస్ చైర్ పర్సన్ జాస్మిన్ షా, కేంద్ర సైన్స్ టెక్నలజీ శాఖ కార్యదర్శి డాక్టర్ శ్రీవారి చంద్రశేఖర్, ఎంఇఐటివై సంయుక్త కార్యదర్శి అమితేశ్ కుమార్ సిన్హా తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

70 కోట్ల ఎల్ ఇ డి చిప్లు, ఒక కోటి స్వదేశి ట్యాబ్ల ఉత్పత్తికి వీలు కల్పిస్తూ ఆత్మనిర్భర్ భారత్కు దన్నుగా నిలవడం, భారతీయ ఎలక్ట్రానిక్స్ ఉత్పతుతలకు 45 బిలియన్ డాలర్ల మార్కెట్ను సృష్టించడం ఫౌండేషన్ లక్ష్యం

రాజన్న భక్తుల మౌలిక సదుపాయాలపై నిర్లక్ష్యం ..

–ఆలయ అధికారుల తీరుపై విశ్వహిందూ పరిషత్ మండిపాటు

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 15:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని విశ్వహిందూ పరిషత్ నాయకులు మండి పడుతున్నారు. రోజు రోజుకు భక్తుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా మౌలిక వసతులు కల్పించడంలో ఆలయ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. భక్తులకు కనీస మౌలిక వసతులు అయిన త్రాగునీరు, మరుగుదొడ్లు, స్త్రీలు ఆరు బయట స్నానాలు చేస్తున్న క్రమంలో వారు బట్టలు మార్చుకోవడానికి గదులు ఏర్పాటు చేయకపోవడం, దేవాలయం లోపలికి వెళ్లే భక్తులు బయట కాళ్ళు కడుక్కుందామంటే నల్లా సదుపాయం లేని పరిస్థితి నెలకొందన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే సమస్యల వలయంగా రాజన్న ఆలయం మారిందని అంటున్నారు. ధర్మగుండానికి కరోనా నిబంధనల పేరుతో తాళం వేయడంతో ఆరు బయట స్నానాలు చేస్తున్న మహిళా భక్తులు బట్టలు మార్చుకునే క్రమంలో ఇబ్బంది పడుతున్నా ఆలయ అధికారుల్లో మాత్రం చలనం రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ ఈవో మహిళా అయినప్పటికీ మహిళ అయి ఉండి కూడా సాటి మహిళ భక్తుల పట్ల శ్రద్ధ చూపకపోవడం ఏంటని అసహనం వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయలు నిరుపేద, మధ్య తరగతి భక్తుల సొమ్ము ఎవరికి ఖర్చు పెడతారో దయచేసి ఆలయ ఉన్నతాధికారులే చెప్పాలని ప్రశ్నించారు. భక్తులకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో ఎందుకీ చులకన భావమని, సంవత్సరానికి 130 కోట్ల ఆదాయం వస్తున్నా సైతం భక్తులకు సౌకర్యాల విషయంలో చులకనగా వ్యవహరించడం సరైంది కాదని, ఇకనైనా భక్తులకు మెరుగైన వసతులు కల్పించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, లేకుంటే దేవాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. భక్తులకు కనీస మౌలిక సదుపాయాల వసతులు కల్పించడంపై ఎన్నో ఫిర్యాదులు ఇచ్చినా, ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆలయ ఈఓపై మానవ హక్కుల కమిషన్ ను ఆశ్రయించి, భక్తులకు మెరుగైన వసతులు కల్పించే విధంగా పోరాడుతామని హెచ్చరించారు.

అది ప్రజాయాత్ర కాదు..పనికిమాలిన యాత్ర : మంత్రి శ్రీనివాస్ గౌడ్

జోగులాంబ గద్వాల, ఏప్రిల్ 15: : జిల్లాలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ చేస్తున్న యాత్ర ప్రజా సంగ్రామ యాత్ర కాదని దొంగ యాత్ర అని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో లేవని అన్నారు.బీజేపీ ప్రభుత్వం మతం పేరు మీద రాజకీయం చేసి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఏనాడు దేవాలయాలకు నిధులు ఇచ్చారా అని ప్రశ్నించారు. కేవలం మెజార్టీ ఉన్న హిందువుల ఓట్ల కోసం ఇరువర్గాల మధ్య రెచ్చగొట్టి మత రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు.పాదయాత్ర అంటే ప్రజల సమస్యలను తెలుసుకొడానికి చేయాలని, కానీ అర్థం కాని పాదయాత్ర చేసి ప్రజలను మభ్యపెట్టి ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.పక్కన ఉన్న కర్ణాటక రాష్ట్రంలో అమలు కానీ సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్కే దక్కుతుందన్నారు. సమావేశంలో గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం, మహబూబ్నగర్ డీసీసీబీ చైర్మన్ నిజాం బాషా తదితరులు పాల్గొన్నారు.

చేనేత సహకార సంఘం సందర్శించిన మాజీ రాజ్యసభ సభ్యులు

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 15:(నేటినిజం ప్రతినిధి):మాజీ రాజ్యసభ సభ్యులు రాపోలు ఆనంద భాస్కర్ గురువారం హనుమాజీపేట గ్రామంలోని చేనేత సహకార సంఘ సొసైటీ కి సందర్శించారు అనంతరం సభ్యులను కలిసి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు.సొసైటీ సభ్యులు ఆయనను సన్మానించారు ఆయన వెంట వేములవాడ పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు అవధూత రజినీకాంత్ పద్మ పీఠం ఎడిటర్ కొక్కుల భాస్కర్ కోడం గణేష్ ఉన్నారు

పలు అభివృద్ధి పనులకు భూమి పూజ

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 15:(నేటినిజం ప్రతినిధి):వేములవాడ అర్బన్ మండలంలోని అనుపురం గ్రామములో రూ.32,00,000 నిధులతో శుక్రవారం ఎమ్మెల్యే రమేష్ బాబు పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆ గ్రామ సర్పంచ్ కొండపల్లి వెంకట రమణ రావు ఆధ్వర్యంలో మహిళా సంఘ భవనం, ఎస్సీ కమ్యూనిటీ హాల్, శాలివాహన సంఘం, డ్రైనేజీ నిర్మాణం, గ్రామ పంచాయితీ పునర్నిర్మాణ పనులకు భూమి పూజలు చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు బూర వజ్రమ్మ-బాబు, జెడ్పీటీసీ మ్యకల రవి, గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు మహిళ సంఘ సభ్యులు, టీఆరెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మెరుగు శ్రీనివాస్ గౌడ్, తెరాసా పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు, పాల్గొన్నారు . ఈ సందర్భంగా నిధుల మంజూరు చేసిన ఎమ్మెల్యే రమేష్ బాబుకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

టీఎస్పీహెచ్ చైర్మన్ను సన్మానించిన ఆలయ ఉద్యోగుల సంఘం

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 15:(నేటినిజం ప్రతినిధి):శ్రీ రాజరాజేశ్వర స్వామి దర్శనానికి విచ్చేసిన పోలీస్ హౌసింగ్ చైర్మన్ కోలేటి దామోదర్ కు రాజన్న ఆలయ ఉద్యోగుల సంఘం సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఉపాధ్యాయుల చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షుడు సిరిగిరి శ్రీరాములు ఉన్నారు.

రాజన్న సేవలో ప్రముఖులు

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 15:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని శుక్రవారం రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ కుమార్ జైన్ లు దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా వారు రాజన్నకు ఎంతో ప్రీతికరమైన కోడె మొక్కు చెల్లించుకున్న అనంతరం స్వామి వారి దర్శనము చేసుకున్నారు.

తదనంతరం కళ్యాణమండపంలో వారికి ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేయగా, ఆలయ ఏఈఓ బి శ్రీనివాస్ శేష వస్త్రం కప్పి లడ్డు ప్రసాదం అందజేశారు.

వారి వెంట చేతన ఐపిఎస్, రాహుల్ హెగ్డే జిల్లా ఎస్పీ, చంద్రయ్య అడిషనల్ ఎస్పీ, డిఎస్పీ చంద్రకాంత్, స్థానిక సిఐ వెంకటేష్ ప్రోటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు ఉన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.